క్లుప్తంగా

తమ్మయ్యవలసలో పూరిల్లు దగ్ధం



తమ్మయ్యవలసలో బాధితురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: మండలంలోని తమ్మయ్యవలస గ్రామంలో శుక్రవారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో నిమ్మకాయల అంకమ్మకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్‌లీకై ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు. సర్వం కాలిబూడిద కావడంతో బాధితురాలు కన్నీరుమున్నీరవుతోంది. సర్పంచ్ శనపతి రాంబాబు ఇచ్చిన సమాచారం మేరకు బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి చిన అప్పలనాయుడు బాధితురాలిని శనివారం పరామర్శించారు. ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ సాయం అందేలా చూడాలని తహసీల్దార్ రత్నకుమార్, హెచ్‌డీటీ భాస్కరరావుకు సూచించారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, డి.గదబవలస ఎంపీటీసీ గిరి, పణుకువలస సర్పంచ్ సత్యనారాయణ ఉన్నారు.

ఘనంగా విగ్రహావిష్కరణ



పూజలందుకుంటున్న దాసాంజనేయస్వామి

రాజాం: స్థానిక పట్టణంలోని సత్యనారాయణపురం తెలగ వీధిలో దాసాంజనేయస్వామి విగ్రహావిష్కరణ శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ప్రధానార్చకులు భట్టరు శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో పెద్దఎత్తున పూజలు, వాస్తు హోమం, మూలామంత్ర హవనం, పూర్ణాహుతి చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెలికాన బదిరీసత్యనారాయణ, ఆలయ నిర్వాహకులు గంధవరపు చినవెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మెంటాడలో రామమందిర పునర్నిర్మాణం



ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న మాజీ సర్పంచ్ రంగరాజు

మెంటాడ: మండల కేంద్రంలోని దిగువ వీధిలో రామమందిరం పునర్నిర్మాణానికి శనివారం భూమిపూజ చేశారు. దాదాపు వందేళ్ల చరిత్ర ఉన్న ఇక్కడి రామమందిరం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకోవడంతో దాని స్థానంలో కొత్తగా ఆలయాన్ని నిర్మించేందుకు గ్రామస్తులు నిర్ణయించారు. ఇదే ఆలయ నిర్మాణానికి మెంటాడ గ్రామ మాజీ సర్పంచ దంతులూరి రంగరాజు రూ.50 వేలను విరాళంగా అందజేశారు. అలాగే ఇదే గ్రామానికి చెందిన డీలర్ దంపతులు నిర్మాణానికి రూ.8 లక్షల విరాళం ప్రకటించినట్లు కమిటీ సభ్యులు ముప్పిడినగేష్ తెలిపారు.

నేడు చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు

బొబ్బిలి: స్థానిక చర్చి సెంటర్‌లోని బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విద్యాలయంలో చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు ఆదివారం నిర్వహిస్తున్నట్లు విద్యాలయం ప్రతినిధి రాజేశ్వరి ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ఈ నెల 5వ తేదీన ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా సేవ్ సోయిల్(నేలను కాపాడుట) అంశంపై ఆయా పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న పాఠశాల, కళాశాల విద్యార్థులంతా ఉదయం 9.30 గంటలకు హాజరు కావాలన్నారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభం

రేగిడి: మండలంలోని అప్పాపురం, మజ్జిరాముడుపేట, గోపింపేట గ్రామాల్లో ఉపాధి హామీ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. వేతనదారులు కోరిన వెంటనే పనులు కల్పిస్తున్నామని, పనులు కావాల్సిన వారు ఫీల్డ్ అసిస్టెంట్లను సంప్రదించాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో ఎస్.హరనాథరావు తెలిపారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

బొబ్బిలి: స్థానిక గాయత్రి కళాశాలలో అఖిల భారత విద్యార్థి పరిషత్ జాతీయ మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు న్యూఢిల్లీలో జరిగే ఈ సభలను విజయవంతం చేయాలని ఆ సంస్థ గిరిజన విద్యార్థుల విభాగం రాష్ట్ర కన్వీనర్ ఎ.ఆనంద్ కోరారు.

10న శిష్టకరణాల వనసమారాధన

రాజాం: పట్టణంలోని పాలకొండ రోడ్డులో అయ్యప్పస్వామి గుడి ఎదురుగా ఉన్న తోటలో ఈ నెల 10వ తేదీన శిష్టకరణాల వన సమారాధన జరుగనుందని రాజాం ప్రాంతీయ శిష్టకరణ సంఘం గౌరవాధ్యక్షుడు, అధ్యక్షుడు పక్కి అప్పలదాసు, కల్లేపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఇదే విషయమై మండల కేంద్రంలో శనివారం జరిగిన శిష్టకరణాల ప్రాంతీయ సంఘ సమావేశంలో వారు మాట్లాడుతూ శిష్టకరణాల సంక్షేమం కోసం భవిష్యత్ కార్యాచరణపై వనసమారాధన అనంతరం అక్కడే సమావేశం ఉంటుందని, శిష్టకరణ కుటుంబాలు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

సీఎం జగన్‌తోనే పేదల సంక్షేమాభివృద్ధి

- భూ పట్టాల పంపిణీలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



భూ హక్కుపత్రాలు అందజేస్తున్న ఎంపీ చంద్రశేఖర్, ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పేదల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. జగనన్న దళిత సంపూర్ణ భూ హక్కు పథకంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పలువురు దళితులు, నిరుపేదలకు భూమి పట్టాలు శనివారం పంపిణీ చేశారు. ఎంపీ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ పేదవాడికి భూమి ఉండాలనే సంకల్పంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త సంస్కరణలు చేపడుతున్నారన్నారు. అసైన్డ్, ఎస్సీ కార్పొరేషన్ భూములను 22ఏ జాబితా నుంచి తొలగించి, దళితులకు, పేదలకు పక్కా హక్కుపత్రాలు అందజేస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ విక్రాంత్ మాట్లాడుతూ దళితులకు అసైన్డ్ భూములపై సంపూర్ణ హక్కు కల్పించడం చరిత్రాత్మకమన్నారు. ఇటువంటి సాహసోపేత నిర్ణయాలు తీసుకోవడం ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే సాధ్యమన్నారు. ఈ భూ హక్కు ద్వారా ఎంతోమంది దళితులు, పేదలకు ప్రయోజనం చేకూరుతోందన్నారు. ఎమ్మెల్యే జోగులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న జగనన్న దళిత సంపూర్ణ భూ హక్కు కార్యక్రమం ద్వారా చాలామంది లబ్ధి పొందుతున్నారన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులకు తన చేతులమీదుగా భూహక్కు పత్రాలు అందించడం చాలా ఆనందంగా ఉందన్నారు. రేగిడి మండలం, సంకిలి గ్రామంలో 55 మంది లబ్ధిదారులకు 20 ఎకరాల అసైన్డ్ భూమిని పక్కా హక్కుగా మార్చుతూ ఇవ్వడం జరిగిందన్నారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ వీరికి సాగు పట్టాలు ఇవ్వగా, ఇప్పుడు సంపూర్ణ హక్కు పత్రాలు ఇవ్వడం చాలా గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీవో బి.శాంతి, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, తహసీల్దార్ బి.సుదర్శనరావు, ఎంపీడీవో శ్యామలాకుమారి, సంకిలి ఎంపీటీసీ మజ్జి శ్రీనివాసరావు, సర్పంచ్ బుడుమూరు పట్టాభి, రాష్ట్ర పోలేటి వెలమ డైరెక్టర్ కింజరాపు సురేష్‌కుమార్, మండల విప్ ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రై మోటార్ సైకిళ్లు అందజేత



దివ్యాంగులకు ట్రై మోటార్ సైకిళ్లు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు శంబంగి, జోగారావు

తెర్లాం: మండలంలోని కూనాయవలస గ్రామంలో తెర్లాం, బలిజిపేట మండలాలకు చెందిన ఇద్దరు దివ్యాంగులకు ట్రై మోటార్ సైకిళ్లను జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, బొబ్బిలి, పార్వతీపురం ఎమ్మెల్యేలు శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, అలజంగి జోగారావు చేతులమీదుగా శనివారం అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులను ఆదుకునేందుకు జిల్లా పరిషత్ నిధులతో సమకూర్చిన ఈ మోటార్ సైకిళ్లను ఇప్పుడు అందజేయడం జరిగిందన్నారు. తెర్లాం మండలంలోని గంగన్నపాడుకు చెందిన చీమల చంద్రశేఖర్, బలిజిపేట మండలంలోని పెదపెంకి గ్రామానికి చెందిన అలజంగి వెంకటేశ్వరరావుకు మోటార్ సైకిళ్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో బొబ్బిలి ఎంపీపీ ప్రతినిధి శంబంగి వేణుగోపాలనాయుడు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, తెర్లాం ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, జెడ్పీటీసీ ప్రతినిధి జి.రామారావు, కూనాయవలస సర్పంచ్ బి.విజయబాబు, మండల పార్టీ నాయకులు బాబ్జీరావు, అప్పలనాయుడు, జగన్నాథం, ఎంపీడీవో రామకృష్ణ, బొబ్బిలి డీఎల్‌డీఓ రవీంద్ర, మండల ప్రత్యేకాధికారి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే అన్ని వర్గాలకు మేలు



రాజాం: కొత్తవలసలో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరిస్తున్న పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ సత్యనారాయణ



వంగర: కోనంగిపాడులో ప్రభుత్వ పథకాలు బోర్డు ఆవిష్కరిస్తున్న పార్టీ మండల కన్వీనర్ సుదర్శనరావు తదితరులు

రాజాం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతోందని, వచ్చే ఎన్నికల్లోనూ ఇదే పార్టీని గెలిపించాలని వైఎస్సార్ సీపీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కొత్తవలస వార్డు సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే) కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి, నాలుగున్నరేళ్లుగా జగనన్న ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే గతంలో టీడీపీ ప్రజలను మోసం చేసిన తీరును తెలియజేసి, చంద్రబాబును నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నేతలు తిరుమలరావు, సప్తగిరి తదితరులు పాల్గొన్నారు.

వంగర: మండలంలోని కోనంగిపాడులో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రభుత్వ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఆయన ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలును వివరించారు.

9న జాతీయ లోక్‌అదాలత్

రాజాం సిటీ: స్థానిక కోర్టు సముదాయంలో రెవెన్యూ, బ్యాంకు, మున్సిపల్ సిబ్బందితో సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన జనవరి 9వ తేదీన జరనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు. రాజీయే రాజమార్గమని, సంబంధిత కక్షిదారులకు అవగాహన కల్పించి, కేసుల రాజీకి వచ్చేలా చూడాలని వారికి జడ్జి సూచించారు. సివిల్, క్రిమినల్, ప్రీ-లిటిగేషన్ కేసులన్నీ ఇరు పార్టీల అంగీకారంతో పరిష్కరించనున్నామన్నారు. సివిల్ కేసులు పరిష్కారమైతే కోర్టు ఫీజు కూడా వాపసు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇవే విషయాలపై కక్షిదారులందరికీ అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ, తహసీల్దార్ ఎస్.కృష్ణంరాజు, ఏజీపీ ఎస్.పోలారావు తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలో పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టిసారించామని మేనేజర్ ఎంవీ నాగరాజు అన్నారు. శనివారం మిర్తిరెడ్డి సచివాలయం పరిధిలో పన్నుల వసూళ్లను ముమ్మరం చేశామన్నారు. ఇందులో భాగంగా రూ.3,62,558 ఆస్తిపన్నును అమృత ఆస్పత్రి యాజమాన్యం చెక్ రూపంలో అందించారన్నారు. వ్యాపార సముదాయాల యజమానులంతా కూడా పన్ను చెల్లించేందుకు ముందుకు రావాలన్నారు.

బాలలతో పనులు చేయిస్తే కఠిన చర్యలు

రాజాం సిటీ: దుకాణాలు, హోటళ్లు, మెకానిక్ సెంటర్‌లలో బాలలతో పనులు చేయిస్తే సంబంధిత యజమానులపై చర్యలు తీసుకుంటామని లేబర్ అధికారి బి.కొండలరావు హెచ్చరించారు. శనివారం స్థానిక పట్టణంలోని బెజ్జిపురం యూత్ క్లబ్ సంస్థ, పోలీస్ శాఖతో కలిసి పలుచోట్ల తనిఖీలు నిర్వహించిన ఆయన పలుచోట్ల బాలలు పనులు చేస్తూ కనిపించగా, వారి యజమానుల వద్దకు వెళ్లి, బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. చిన్నవయసు వారితో పనులు చేయించకూడదని, ఇకపై అలా చేస్తే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో యూత్‌క్లబ్ సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ ఝాన్సీ, ఎస్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

‘ఆడుదాం ఆంధ్రా’ కిట్లు పంపిణీ



తెర్లాం: స్పోర్ట్స్ కిట్లు అందజేస్తున్న ఎంపీపీ ఉమాలక్ష్మి, ఎంపీడీవో రామకృష్ణ

తెర్లాం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల కిట్లు శనివారం పంపిణీ చేశారు. ఈ నెల 15వ తేదీ నుంచి పోటీలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎంపీడీవో శంబంగి రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి చేతులమీదుగా పంచాయతీ కార్యదర్శులకు కిట్లు అందజేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగిఉన్న క్రీడానైపుణ్యాన్ని వెలికి తీసేందుకే సచివాలయ, మండల, నియోజకవర్గ, రాష్ట్ర స్థాయిల్లో ఆడుదాం-ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ఈ క్రీడాపోటీలు నిర్వహిస్తోందని, యువత అంతా ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీడీవో రామకృష్ణ మాట్లాడుతూ ప్రతీ సచివాలయం నుంచి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలకు యువత రిజిస్ట్రేషన్ చేసుకునేలా సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ ఏవో డీవీ అప్పారావు, ఈవోపీఆర్‌డీ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో భద్రపరిచిన ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల కిట్లను ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు శనివారం పరిశీలించారు. ఈ నెల 15వ తేదీ నుంచి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం పేరిట ప్రభుత్వ నిర్వహిస్తున్న ఆటల పోటీల కోసం సచివాలయాల వారీగా ఈ కిట్లు పంపిణీ చేయనున్నారు. ఆసక్తి ఉన్న వారు ఆటల పోటీల కోసం పేర్లు నమోదు చేసుకోవాలని ఎంపీడీవో రమామణి తెలిపారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

- హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



హెల్త్ వెల్‌నెస్ సెంటర్ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని వెలగవలస గ్రామంలో కొత్తగా నిర్మించిన హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో టీడీపీ హయాంలో ప్రజల ఆరోగ్యాన్ని అప్పటి పాలకులు పట్టించుకోలేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల ఆరోగ్యం, సంక్షేమంపై ప్రత్యేక దృష్టిసారించి, అనేకానేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు సొంత గ్రామాల్లోనే అందించే ఉద్దేశ్యంతో ప్రతీ గ్రామ సచివాలయంలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేసి, ప్రజలకు మంచి వైద్య సదుపాయాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. గ్రామస్తులకు నిరంతరం వైద్యసేవలు అందించేందుకు హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో ఓ ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలను అందుబాటులో ఉంచడం జరుగుతుందని, ఏ వేళలోనైనా ప్రజలు వైద్యసేవలు పొందవచ్చన్నారు. గ్రామీణులంతా ఈ హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ చేపేన ఫల్గుణరావు, ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు, పార్టీ సీనియర్ నాయకులు బాబ్జీరావు, బోను అప్పలనాయుడు, ఎంపీడీవో శంబంగి రామకృష్ణ, తహసీల్దార్ రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి



మెంటాడ: మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు



రామభద్రపురం: మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి గోవిందరావు



రాజాం: సూచనలిస్తున్న మండల ప్రత్యేకాధికారి సుధాకర్

మెంటాడ: జగనన్న కాలనీ గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎం.వెంకటేశ్వరరావు సూచించారు. శనివారం మండల కేంద్రంలో సంబంధిత అధికారులతో సమావేశమైన ఆయన నిర్మాణాల తీరుపై సమీక్షించారు. మండల వ్యాప్తంగా 1545 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 1050 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయన్నారు. మిగిలిన ఇళ్లు ఈ నెలాఖరు నాటికి పూర్తి చేసేలా సంబంధిత అధికారులు దృష్టిసారించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో త్రివిక్రమ్, పీహెచ్‌సీ వైద్యురాలు లోకప్రియ, డీటీ వెంకటరావు, హౌసింగ్ ఏఈ డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: జగనన్న కాలనీల్లో సామూహిక గృహప్రవేశాలకు సిద్ధం కావాలని మండల ప్రత్యేకాధికారి గోవిందరావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రమామణి, తహసీల్దార్ సులోచనరాణిలతో కలిసి ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బందితో శనివారం సమావేశమైన ఆయన జగనన్న కాలనీ గృహ నిర్మాణాలపై సమీక్షించారు. త్వరలోనే సామూహిక గృహప్రవేశాలు జరగనున్నాయని, దీనికి లబ్ధిదారులతో గృహాలను సిద్ధం చేయించాలని ఆయన సూచించారు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలను ప్రభుత్వమే కల్పిస్తున్నందునే లబ్ధిదారులతో నిర్మాణాలను వేగవంతం చేయించాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈఈ సింహాచలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాజాం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్‌లతో శనివారం సమావేశమైన మండల ప్రత్యేకాధికారి బి.సుధాకర్ జగనన్న కాలనీ గృహ నిర్మాణాలపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరిలో జరిగే సామూహిక గృహ ప్రవేశాలకు లబ్ధిదారులను సిద్ధం చేయాలన్నారు. వారితో నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగరాజు, మున్సిపల్ మేనేజర్ ఎంవీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కచ్చితమైన ఓటరు జాబితాయే లక్ష్యం

- ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంలో ఆర్‌డీవో సాయిశ్రీ



రామభద్రపురం: ఓటుహక్కు నమోదుపై ఆరాతీస్తున్న ఆర్‌డీవో సాయిశ్రీ



తెర్లాం: పణుకువలసలో ఓటర్ల నమోదు వివరాలను బీఎల్‌వోలను అడిగి తెలుసుకుంటున్న తహసీల్దార్ రత్నకుమార్



రాజాం సిటీ: బొద్దాంలో బీఎల్‌వోలకు సూచనలిస్తున్న తహసీల్దార్ రాజు



వంగర: ఎం.సీతారాంపురంలో ఓటర్ల దరఖాస్తులు పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుధారాణి

రామభద్రపురం: కచ్చితమైన ఓటర్ల జాబితా రూపొందించడమే లక్ష్యమని ఆర్‌డీవో సాయిశ్రీ అన్నారు. మండలంలోని కొట్టక్కి, బూసాయవలస, రామభద్రపురం ఉన్నత పాఠశాలల్లో పోలింగ్ బూత్‌ల వద్ద నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని శనివారం ఆమె పరిశీలించారు. కార్యక్రమ నిర్వహణపై తహసీల్దార్ ఎ.సులోచనరాణిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో సురక్షిత పాలనకు ఓటే వజ్రాయుధమని, ఓటుహక్కు నమోదుపై ప్రత్యేకదృష్టి సారించామన్నారు. డిసెంబరు నెలాఖరు వరకు కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 18 ఏళ్లు నిండిన యువతీయువకులంతా ఓటుహక్కు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్‌వోలు అనిల్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: గ్రామాల్లో 18 ఏళ్ల వయసు నిండిన యువతీ,యువకులందరినీ ఓటర్లుగా చేర్పించాలని తహసీల్దార్ బి.రత్నకుమార్ సూచించారు. మండలంలో రెండు రోజులపాటు జరగనున్న ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఓటర్ల నమోదును ఆయన పరిశీలించారు. ఓటర్ల జాబితాల్లో మరణించిన ఓటర్లు, శాశ్వతంగా గ్రామం విడిచి వెళ్లిన వారి ఓట్లను తొలగించాలని సిబ్బందికి సూచించారు.

బాడంగి: మండలంలోని వాడాడ, కోటిపల్లి, ఆకులకట్ట గ్రామాల్లో శనివారం నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంను తహసీల్దార్ అజురఫీజాన్ పరిశీలించారు. బీఎల్‌వోలు ప్రజలకు అందుబాటులో ఉండి, వారికి అవసరమైన సేవలు అందించాలన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేయడంతో పాటు కొత్తగా ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకుంటున్న వారి వివరాలు తీసుకుని, ఓటు వచ్చేలా చూడాలని తెలిపారు.

రాజాం సిటీ: ఓటుహక్కు నమోదు, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేయడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎస్.కె.రాజు కోరారు. శనివారం మండలంలోని బొద్దాం, పెనుబాక గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆయన కొత్తగా ఓటుహక్కు నమోదు చేసుకున్న వారికి ఇదో చక్కని అవకాశమని, 18 ఏళ్ల వయసు నిండిన వారంతా ఓటరుగా నమోదు కావాలన్నారు.

వంగర: అర్హులందరికీ ఓటుహక్కు కల్పిస్తున్నట్లు రాజాం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.సుధారాణి తెలిపారు. శనివారం మండలంలోని ఎం.సీతారాంపురం, అరసాడ, సంగాం గ్రామాల పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆమె ప్రత్యేక ఓటర్ల నమోదు ప్రక్రియను గమనించి, 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులందరికీ ఓటుహక్కు వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.ఐజాక్, బీఎల్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బిలి: మండలంలో పలుచోట్ల జరిగిన ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ఆర్‌డీవో ఎ.సాయిశ్రీ శనివారం పరిశీలించి, బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేయడంతో పాటు కొత్త ఓటర్ల నమోదు కూడా చేపట్టాలని తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

రాజాం సిటీ: మిచౌంగ్ తుపాను నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో రేణుకాసాయి సూచించారు. శనివారం మండలంలోని ఒమ్మి, రాజయ్యపేట, కంచరాం తుపాను ప్రభావం, వర్షాల బారినపడి పంటనష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కోత చేయని వరిచేలను అలాగే ఉంచాలని, కోసిన పంటను పెద్దపెద్ద కుప్పలుగా పెట్టుకోవాలని తెలిపారు. వీలైతే వరికుప్పలపై టార్పాలిన్లు కప్పాలన్నారు.

బాడంగి: తుపాను దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండాలని, పంటలు నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో శిరీష సూచించారు. మండలంలోని వీరసాగరం గ్రామ వరిపొలాల వద్ద ఉన్న రైతుల వద్దకు శనివారం ఆమె వెళ్లి, తుపాను ప్రభావం పంట నష్టం జరగకుండా చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

రేగిడి: విద్యార్థుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు సూచించారు. శనివారం మండలంలోని చాటాయవలస ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. రక్తహీనత, పిల్లల ఎదుగుదల, వయసుకు తగ్గ బరువు వంటి అంశాలను పరిశీలించారు. ప్రతిరోజూ పిల్లలకు పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
బొబ్బిలి / రాజాం
9951602891, 9010133309
Office mail : vzmadvt@gmail.com